క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు మండలంలోని గూడుపల్లి పంచాయతీ కోటపల్లికి చెందిన రాజారెడ్డి (70) మద్యం విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద లభించిన 30 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బ్రాండ్ల ప్రకారం మద్యం స్టాకు ఉంచాలి



మద్యం దుకాణంలో రికార్డును పరిశీలిస్తున్న ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ శాస్త్రి

పీలేరు : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో బ్రాండ్ల ప్రకారం స్టాకు ఉంచాలని చిత్తూరు మద్యం డిపో ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ శాస్త్రి అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండ్ల ప్రకారం స్టాకు ఉంచడం ద్వారా ఫిజికల్‌గా పరిశీలించడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. మద్యం దుకాణం తోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశీలనాధికారులు నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ములకలచెరువు: ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బ్లాసం డిగ్రీ కళాశాలలో సోమవారం హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ రాజు పర్యవేక్షించారు. సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దీక్ మాట్లాడుతూ చిన్నారుల రక్త అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రక్తదానం చేసిన 32 మంది యువకులను సంస్థ సభ్యులతో పాటు కళాశాల యాజమాన్యం, బ్లడ్ బ్యాంకు వైద్య సిబ్బంది అభినందించారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి డి.ఆర్.జగదీష్ అన్నారు. సోమవారం స్థానిక బేబివెల్‌కమ్‌హోంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ నిస్వార్థంగా సేవలు చేస్తున్నారన్నారు. జిల్లా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తుందన్నారు. కరోనా సమయంలో పలువురి ఆదుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు చంద్రశేఖర్, శ్రీనివాసులు,మౌలాలి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

మదనపల్లె : మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన నాగరాజు ఇంటిలో సారా విక్రయిస్తుండగా సోమవారం ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి పోలీసులతో కలిసి దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గౌతమినగర్‌కు చెందిన చలపతి నీరుగట్టువారిపల్లెలో మట్టికుండల వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే మట్టికుండల చాటున అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించి దాడి చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి పది అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని బండ్లపై గ్రామానికి సమీపంలో స్థానికుడైన మోహన్‌కుమార్ సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితుని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ఉంజల్‌సేవ

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉంజల్‌సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలోని మండపంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను ఊయలపై ఊపుతూ పూజలు చేశారు. మహిళలు భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏఓ నాగప్రసాద్, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పోతపోలు లో సర్పంచ్ ఈశ్వరయ్య అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

పేదల సంక్షేమం కోసం నవరత్నాలు

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- 33వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



33వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె: పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని 33వవార్డు కౌన్సిలర్ ఎం.వి.రమణ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వార్డులోని చౌడేశ్వరినగర్, మాయాబజార్-1,2,3 వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రజలను పలుకరించారు. ప్రజాసమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, వాటి అమలులో ఏవైనా లోటుపాట్లు, ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై ప్రజలను అడిగి వారి నుంచి సమాచారాన్ని సేకరించారు. స్థానిక సమస్యలపై తెలపాలని కోరగా.. మాయాబజార్‌కు చెందిన లక్ష్మీ, మురళీ దంపతులు తమకు రేషన్ బియ్యం అందడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదుచేశారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వారికి రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, వీఆర్వో వెంకటరమణను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని గుర్తుచేశారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది నమోదుచేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలతో పథకాలు అందకపోతే వెంటనే వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆర్.వి.శివారెడ్డి, ఎస్వీ.రమణ, మేస్త్రీశ్రీనివాసులు, ఈశ్వర్‌నాయక్, వసీం, రామిశెట్టిశివయ్య, కరీముల్లా, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, సదాశివ రెడ్డి, చందూరెడ్డి, సచివాలయ కన్వీనర్ మునిశేఖర్, బండిమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వాల్మీకిపురం పంచాయతీ ప్యారంపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు ఎమ్మెల్యే చింతల దృష్టికి రావడంతో స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. ఆదర్శంగా, పారదర్శకంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందన్నారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ, ఇతర పథకాలు అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, తహ సీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీం, షాహెద్, మహేష్, రఘు, రాయుడు, సైపుల్లా, రవి, ఖాదరి, సుధాకర్ రెడ్డి, డివి రమణ, వెంకట్రమణ రెడ్డి, రెడ్డెప్ప, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలి



ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ శరత్‌కుమార్‌రెడ్డి



విద్యార్థిని వర్షితకు అభినందనలు తెలపుతున్న ఉపాధ్యాయినులు

మదనపల్లె : చదువుకు పేదరికం అడ్డుకాదని, మంచి ప్రతిభ కలిగి, చదువుకోవాలన్న ఆసక్తి కలిగిన ఆడపిల్లలను తల్లిదండ్రులతో పాటు సమాజంలోని వారు ప్రోత్సహించాలని అంకిశెట్టిపల్లె సర్పంచ్ వై.శరత్‌రెడ్డి అన్నారు. సోమవారం అంకిశెట్టిపల్లె పంచాయతీ రామాపురంకు చెందిన సి.శిల్ప ఇంటర్‌పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 1,000 కి 991 మార్కులతో ప్రథమస్థానం , రెడ్డిసులోచన 961, పదోతరగతిలో జే.భవ్యశ్రీ 593 మార్కులు సాధించడంపై సచివాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. పంచాయతీలోని ప్రతి విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని చదువుల్లో చక్కగా రాణించాలన్నారు. పేదవిద్యార్థుల చదువుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తూ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువస్తున్నారన్నారు. అవకాశం ఉన్న ప్రతి విద్యార్థి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో కోటపల్లె విద్యార్థిని ప్రతిభ

పీలేరురూరల్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక కోటపల్లె జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. వర్షిత 588 మార్కులతో జిల్లాలో జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిట్లు హెచ్ ఎం బి. పద్మావతి తెలిపారు. సోమవారం విద్యార్థినికి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినులు 500కు పైగా మార్కులు సాధించారని చెప్పారు. అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయినులు, విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు లక్ష్మీదేవి, కృష్ణవేణి, ఉదయశ్రీ, నాగరాణి, అలివేలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీలో మంగళవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి చరపల్లోల్ల పల్లె, బైనేని హరిజనవాడ, ఆవులయ్యగారి పల్లె, బండమీదకురవపల్లె, మెరుగువాండ్ల పల్లె, ఎర్రకొండప్పగారిపల్లె, వంకాటపల్లె, కొండలసందు, పోతిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిగ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సింహ వాహనంపై శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : మండలంలోని దేవులపల్లె గ్రామ దేవత శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిద్దన్న , శివనంద ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక అలంకరణ , పూజల అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి ఉత్సవాలు చేశారు. సాయంత్రం పవిత్ర అమ్మవారి జ్యోతులను ఆలయంలో తయారు చేసి అలంకరించిన చిందినీ బండిలో సింహవాహనంపై గ్రామ పురవీధులలో ఊరేగించారు. అమ్మవారి రథం ముందు కోళాటం, బళ్లారి డ్రమ్స్, మంగళవాయిద్యాలు, గొడుగులు ముందు నాటి దారతో ఇంటింటికి స్వాగతం పలికారు. ఇంటి ముందు జ్యోతి కళాకారులు, కోలాటనాట్యం కళాకారులు ఎంతో ఆకట్టుకున్నారు. అనంతరం జ్యోతులు ఆలయ ప్రవేశం చేసిన అనంతరం మొక్కులు చెల్లించిన భక్తులు తీర్థప్రసాదాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు ప్రభాకర్‌నాయుడు, అంజన్‌కుమార్, గోవర్ధన్‌నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- 275 లీటర్ల సారా స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : మదనపల్లె మండలంలో అక్రమ మద్యం, సారా తయారీ, విక్రయాల కట్టడికి ప్రత్యేక తాలూకా పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి 275 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలోని వడ్డిపల్లె సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నండగా ఉడుంవారిపల్లె తాండాకు చెందిన చిన్నానాయక్ (38) సారా తరలిస్తుండగా అతన్ని అరెస్ట్ చేసి అతని నుంచి 260 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన నరసింహులు అనే నిందితున్ని అరెస్ట్ చేసి అతని నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులిద్దరిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా నరసింహులు నెల రోజుల్లోనే తాలూకా పోలీస్‌స్టేషన్‌లో మూడు సారా కేసుల్లో నిందితుడిగా నమోదయ్యాడని, అతన్ని జిల్లా బహిష్కరణ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. మదనపల్లె డివిజన్ పరిధిలో ఎక్కడైనా మద్యం, గంజాయి, సారా, కర్ణాటక మద్యం రవాణా, విక్రయం, తయారీ, బెల్టుషాపుల నిర్వహణ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక బృందం పోలీసులు నిరంతరం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తారని డీఎస్పీ తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



అమ్మవారికి బోనాలు, దీవిటీలు సమర్పిస్తున్న మహిళలు

గుర్రంకొండ: గుర్రంకొండలో బోనాల పండుగను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామదేవత శ్రీ పాలేరమ్మతల్లి తిరునాలకు ముందురోజున అమ్మవార్లకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం స్థానిక బజారు వీధిలో ఉన్న అమ్మవారిని మేళ తాళాలతో ఊరేగింపుగా పోలేరమ్మతల్లి ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవారి సేవకులు ఆనవాయి తీప్రకారం అమ్మవారికి మొదటి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం గ్రామంలోని మహిళలు చలివిడి ముద్దలు, బోనాలు, దీటీలను సమర్పించారు. పలువురు భక్తులు చీరె సారెలు సమర్పించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



రూ.50 నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బి.కొత్తకోట: మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదుకున్నారు. మండలంలోని నాయనబావి పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన శివశంకర్ మృతి చెందిన విషయాన్ని ఎంపీటీసీ సభ్యుడు వి.రామసుబ్బారెడ్డి గత శుక్రవారం బి.కొత్తకోటకు వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్దకు మృతుని కుటుంబీకులను తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. దీనిపై మంత్రి రూ.50వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ నగదును సోమవారం మంత్రి, ఎమ్మెల్యే అందజేయగా ఎంపీటీసీ సభ్యులు వి.రామసుబ్బారెడ్డి..శివ శంకర్ భార్య లలితకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం మురళీ, నరసింహారెడ్డి, భూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ బి.చంద్రశేఖర్‌రెడ్డి

మదనపల్లె సిటీ: విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ బి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఫెస్టా-ఈకె23ను నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తెలివితేటలను ఉపయోగించి గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. క్రమశిక్షణ పాటించాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్, కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, కరస్పాండెంట్ రామమోహన్‌రెడ్డి, చైర్మన్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ సింగర్స్ రేఖశ్రీ ఆలపించిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అదృశ్యమైన యువతి తల్లిదండ్రులకు అప్పగింత

పెద్దమండ్యం: మండలంలోని దిగవపల్లె పంచాయతీ వడ్డి వంక తాండాకు చెందిన బుక్కె మునే నాయక్ కుమార్తె నందిని (16) గత నెల 13న ఇంటి నుంచి అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వైఎస్సార్ జిల్లా కడపలో బంధువుల ఇంట ఉన్నట్లు గుర్తించి ఈమెను సోమవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు నట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ విరాళం



ఎంపీ విరాళాన్ని రజకులకు అందజేస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని రజకుల కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ నల్ల వీరగంగమ్మ ఆలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.50 వేల విరాళం అందజేశారు. సోమవారం సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా ఎంపీ విరాళంను స్థానిక నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకారం అందించిన ఎంపీ మిథున్‌రెడ్డి రజక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు రామయ్య, ఎంపీటీసీ నరసింహారెడ్డి, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, మల్లికార్జున, నరేష్‌రామకుమార్‌రెడ్డి, ప్రదీప్, పెద్దోడు, ఓబులేషు, కుసుమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ కన్వీనర్ రామకృష్ణ

కేవీపల్లె : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి అన్ని రాజకీయ పార్టీలు తమ మద్దతు తెలపాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ దుడ్డు రామకృష్ణ కోరారు. సోమవారం ఆయన కేవీపల్లె ఎమ్మార్పీఎస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడం ద్వారా ఎస్సీల్లోని 59 కులాలు విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజ్యాధికారంలో అభివృద్ధి సాధిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన అన్ని కమీషన్‌లు కూడా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, వెంకటరమణ, శ్రీనివాసులు, కృష్ణయ్య, గణేష్, రాజేష్, ప్రణీత్, ప్రదీప్, సంతోష్, రేవంత్, సరోజ, రాధ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

- ఆర్డీఓ ఎం.ఎస్.మురళి





ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళి, అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. గాలేరు-నగరి సుజల ప్రవంతి నుంచి హంద్రీ నీవా సుజల ప్రవంతి వరకు నీటి ఎత్తిపోతల పథకం ఫ్రీజర్ మెయిన్-05 నుంచి ములకలచెరువు మండలం నాయునిచెరువు ట్యాంకు నిర్మాణ పైప్‌లైన్ ప్రాజెక్ట్ కోసం గంగిరెడ్డిపల్లె, కొట్లపల్లె, దిగువపాళ్యం గ్రామాల నుంచి జరిపిన భూసేకరణకు పరిహారం ఇవ్వాల్సిందిగా గ్రామస్తులు వినతిచేశారు. పోతబోలు లేఅవుట్‌లో తనకు కేటాయించిన స్థలంలో పెద్ద రాళ్లు ఉండటంతో ఇంటి నిర్మాణానికి అనువుగా లేదని, తనకు వేరొకచోట స్థలం కేటాయిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని తూర్పుకొత్తపేటకు చెందిన కే.భారతి ఫిర్యాదుచేసింది. బసినికొండ గ్రామంలోని సర్వేనెంబర్.1070లోని 5.12 ఎకరాల ఆస్తిని భర్త మరణించినందున తన పేరుమీదకు బదలాయించి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ఏడేళ్లుగా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లెకు చెందిన షేక్ జమాల్‌బీ అర్జీ సమర్పించింది.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

రామసముద్రం: ప్రజల నుంచి వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన రామసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు స్వీకరించి క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. అనంతరం అర్జీలు సమర్పించేందుకు అర్జీదారులు ఎగబడ్డారు.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



గ్రంథాలయ అధికారికి పుస్తకాలను అందిస్తున్న హెచ్ఎం శ్రీదేవి

వాల్మీకిపురం: ఈ నెల 08వ తేదీ నుంచి జూన్ 11 వరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం, కథలు, చిత్రలేఖనము, పేపర్ ఆర్ట్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్, ఆటల పోటీలు, తదితర సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి విద్యార్థులకు ఉపయోగపడే ఎంసెట్, మెడిసిన్, నీట్ పుస్తకాలను గ్రంథాలయ అధికారికి అందజేశారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మానసిక వికాసానికి గ్రంథాలయలు తోడ్పడుతాయి

మదనపల్లె సిటీ: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి గ్రంథాలయలు తోడ్పడుతాయన్నారు. శిబిరంలో అనుభవం కలిసివారు శిక్షణ ఇస్తారన్నారు. వేసవిలో పలు అంశాలను నేర్చుకోవచ్చునన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ గ్రంథాలయాధికారి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు మానసిక ఉల్లాసానికి కలిగిస్తాయన్నారు. 34 మంది విద్యార్థుల గ్రంథాల సభ్యత్వాలకు తన సొంత డబ్బులు చెల్లించారు .ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వసంత కుమారి, రచయితలు టీఎస్ఏ క్రిష్ణమూర్తి, తిరుపతి రావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

గుర్రంకొండ: గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సురేంద్రబాబు అన్నారు. సోమవారమ స్థానిక తెలుగు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంఈవో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తారన్నారు. ఇందులో స్పోకెన్ ఇంగ్లీషు, పాటలు, క్రీడలు, చిత్రలేఖనం వంటివి నేరిప్తారన్నారు. అనంతరం డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సుధాకర్ పిల్లలకు చిత్రలేకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రెడ్డికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి: గ్రంథాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వేసవి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ ఆజాద్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడులు విద్యార్థులు మానసికంగా, శారీరకంగా, విద్యాపరంగా మెరుగుపడటానికి ఈ శిక్షణ ఎంతో ఉపకరిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు శిక్షణకు విద్యార్థులను పంపాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి విజయ్ కుమార్, సాహితీవేత్త వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అధికారి జిలానీబాషా ప్రారంభించారు. మొదటి రోజు సుమారు 20 మంది బాలబాలికలు హాజరయ్యారు. దినపత్రికలు, కథల పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. క్యారంబోర్డు, చెస్ క్రీడలపై మెలకువలు నేర్పారు. స్పోకన్ ఇంగ్లీష్‌పై సూచనలు ఇచ్చారు.